# పెద్దమర్రి

అక్కా ! నీకు వుత్తురం రాయక ఎంతకాలమైందో ? నీవేమనుకుంటున్నావో ? కాని, నీవున్న చోటికి నా మనుస్సును పంపినా, అది ఆ అపరిచితమైన తావును చేరడానికి కొంతకాలం పడుతుంది.

నీవు కాపురం వుంటున్న ఆపాతాళలోకం ఇక్కడుందా? అక్కడుందా? ఏడేడు సంద్రాల వెనుక మిన్నూ మన్నూ ఏకమై కానవచ్చేచోట, నెలవంక మన తెలుగువారి అర సున్నలా, సగం కోసిన కరపుచ్చ పండులా, చెలిచెక్కున నిలువుగా సింగారించిన శృంగారపు గుర్తులా, కనిపించే చోట వుంటున్నావు. ఆ నీతావుకు వుత్తరం పంపేందు కయ్యే ఖర్చుతో మన కొత్త దూడ మెడకు గజ్జెల పట్టెడే కొనవచ్చు తెలుసా ?

అక్కా ! ఇంతకు సంగతేమిటి ? అంటె, మన బావ అమ్మానాన్నలు, అదేనమ్మా నీ మురిపాల మొగుడులేడూ ? నీకంట్లకామయ్య, నీసిగపువ్వు, అదుగో ఆ బాలచంద్రుని కన్నవారు అంటె మీ అత్తామామలు, మిమ్మల్ని చూడ్డానికంటూ వస్తున్నారు, సంతానం కల్గిన వాళ్లకు పున్నామనరకం ఉండదని విన్నాను. వాళ్లు వైతరణిని సులువుగా దాటివెళ్తారట. అందరూ అలాదాట్తా రో లేదే కానీ, మీ రంగనాధుణ్ణి కన్నందుకు మీ అత్తామామలు మాత్రం బావ తోకపట్టుకు సముద్రాలు దాటడం మట్టుకు ఖాయం !

అక్కా ! నీకు పుణ్యం ఉంటుంది. ఈ ఉత్తరం గట్టిగా చదవకు, ఎందుకంటావా ? ఏమాత్రం నెలవంక అనేమాట చెవినపడిందో ? చెంగున హనుమంతుడి గంతువేసి, నీ, చేతిలోంచి ఉత్తరం లాక్కుని 'ఆహా ! ఏంసొగసు ! ఏం షోకైన పోలిక ? అంటూ మెల్లిగా నీపక్క చేరి ఆపదం మర్చి నీపాదం పట్టగలడు. ఇకనీవు, ఆ రసధునిలో తలమునకలై, ఆ సోగ్గాడి కొంటెచూపూ, కోరమీసం చూస్తూ మురిసిముత్యాల ప్రోవై, ఉత్తరాన్ని మెత్త కింద పెట్టగలవు సుమా !

అబ్బా ! దొంగకోపం నటించకే ? అది బావకేలాభం ! వచ్చే సిగ్గుల దొంతరలు, దొంతర నవ్వులు రెప్పల్లో ఆపి, లేనికోపం తెచ్చుకుని గుర్రంటూ చూడకు. అలుకలు

పోతే కెంపెక్కిన నీ చెంపలు మోదుగుపూలుపూయగా చెమటలు ముత్యాలముగ్గులు పెట్టేను; భద్రం!

ఇదంతా కృష్ణావతార వర్ణనకు ముందు హరివంశం, వంశవంశాను చరితలను వర్ణించి నట్టే అసలు విషయానికి ముందు ఏదో ముచ్చటగా మురిపించాను, నిజానికి ఏదీవృధాకాదు;

బావను అడుగు, చెబుతాడు, అసలు కన్నా బైప్రాడక్ట్‌కే ప్రాధాన్యం ఎక్కువ అంటూ, అంతేకాదు; నీ విసుగు గమనించి, ఒక్క నిమిషం ఆగురా డార్లింగ్, పెంటప్రోగు నందు ప్రథురత్నముండినా ప్రాజ్ఞుడైన వాడు దానిగొనడే ? అన్న భర్తృహరి సుభాషితం వినలేదా? అంటూ ఆ భర్తృహరికి ఈ సుభాషితాన్ని అంటగడ్తూ నీ అభిముఖ్యాన్ని సాధించి, ఉత్తరం అందుకుని చదువుతాడు. నిజమేకదూ ? అబ్బ! వొప్పుకున్నావే వొక్క సారికి, సరే! విను.

అక్కా! అన్నిటికన్నా వినదగ్గ విషయం వ్రాస్తున్నాను.

మనవూరికి కోశెడు దూరాన దారిపక్కనే ఉన్న గౌరయ్య అరఎకరం పొలాన్ని ఆక్రమించి పెరసిన పెద్ద మర్రిముచ్చట. ఎందుకోగాని, మాట వరసకు మర్రి నెగలిన చోట మరేచెట్టూ చేను పెంపు కాదంటూ మన నాయనమ్మ అంటూ ఉండేది. ఆ మర్రి ఆదివటంవలె విస్తరిస్తూ నింగికి శిఖరాలు పెంచి, తిరిగి ఆ శిఖరాలే వూర్ధ్వమూలాలై శాఖలను భూమికి పంపుతూ అంతా తనమయంగా పెరిగింది.

దాన్నిచూచిన వాళ్లంతా తుప్పలు విరబోసుకుని నిల్చిన పెనభూతంగా, గొడుగు పర్చి నిల్చిన వామనావతారంగా, చూస్తూఉండేవారు. ఆ తరాలనాటి పెద్ద మర్రి గుర్తుంది కదూ ?

ఆయ్యో! నాతిక్కకాకపోతె, పోయి పోయి నీవు ఆ చెట్టునే మరుస్తావా? నీ ప్రణయసాక్షినీ, రహస్యకేళీగోష్ఠిని ఎలామరుస్తావ్ ? అక్కా! మీ పెళ్లైన కొత్తలో నన్ను దొంగను చేస్తూ నాకళ్లకు ఎర్రదస్తీకట్టి, నీవూ, బావ దాగుడు మూతల నెపంతో ఎన్ని ముద్దులదొంతరలూ! దొంకరల ముద్దులో?

ఈ మాటల్తో కొత్తసిగ్గులొలుకుతూ సిరిమల్లెకాకు. బావ అమాంతం కోటుకే తగిలించుకోగలడు.

మంచికో చెడ్డకో గాని యిప్పుడు మనవూరూ, పరిసరాలూ, వావిలిపొదలూ, మామిడితోపూ, గుట్టరాళ్లూ, గుడిమెట్ట, అంతా మారింది, మారింది అంటూ అనవచ్చోలేదో కాని మారింది.

మీ దాగుడుమూతల పుణ్యమా అంట, యీనాడుమన పెద్దమర్రికి అదృష్టం కలిసొచ్చింది. మీరువేసిన బాటవెంబడేనడిచినట్టు మనవూరి పిల్లలంతా ఎండాకాలం అక్కడ విడిది పట్టుగావుండేవారు. దేవుళ్లాంటి పసిపిల్లలూ, పసులపిల్లలు ఆడ్తూ పాడ్తూ వుండేచోట దయ్యెం, భూతం, గాలీ, గీలీ, జిన్నూ, సైతాను, కొర్విదయ్యెం, బ్రహ్మ రాక్షసి, ఏవీ వుండవంటూ చిన్నాపెద్దా ఆ చెట్టు కిందికి చేరేవారు. ఇంకాచేరుతూనే వున్నారు.

ఆ మధ్యలో వోఫకీరు అక్కడేతిష్ఠవేశాడు. ఆఫకీరు పక్కనే మంత్రసిద్ధినిపొందిన మాంత్రికుడూ పాకవేసుకున్నాడు. తాయెత్తులూ, తావీజలూ, విభూతులూ, కుంకుమ పొట్లాలు, వూదూ, వూదూబత్తీలు చేరవచ్చాయి.

మంత్రసిద్ధులకు చెట్టు మహిమ, చెట్టు పసిద్ధికి మంత్ర ప్రభావం, వొకదానికొకటి ఆధారధేయంగా వుపకరిస్తూవచ్చాయి. ఇలాదినదిన ప్రవర్ధమానమౌతున్న మన పెద్దమర్రి విశాలకీర్తిని గూర్చి మన శోభనాద్రి మాటల్లోవ్రాస్తున్నాను.

'మనూరి పున్నెమా అంట మన పెద్దమర్రయ్య కీర్తి యింతింతాకు, యిస్తారాకు కానుగాకు, కస్తూరాకు' అంట ఈ నోటా ఆనోటా వడి గిరిదాటి వూరుదాటి, ఏరుదాటి, సడక్లుదాటి, సందులుదాటి, సర్కార్లవడి సదరు, మెట్టెక్కింది. ఇంతకు దాని పుట్టుక లక్షిణమే అసొంటిది.

అసలు యీసెట్టు పుట్టుకే తెల్వదు. తల్లి ఏరేదో ? పిల్లఏరేదొ ? ఆనవాలు వట్టి నోళ్లేలేరు. నారాయణమూర్తోలె యీసెట్టు ఆది, అనాది, వుగాది, ఇంతకు యీభూమండలమంత జలప్రళియంజొచ్చి ఏకార్ణ్ణవమైనప్పుడు, మన ఈమర్రి సెట్టాకు రాలంగ, విష్టుమూర్తివొచ్చి ఆ ఆకు మీదనే పండుకుంటడంట.

అందికే ! ఈ ఆది విష్టుమూర్తికి అంటె మన కృష్ణయ్యకు పడ్కమంచమోలె పని కొచ్చె ఆదిశేషయ్య గూడంగ ముద్దుగ యీ మర్రి బోదకె కోటబురుజోలె పుట్ట వెట్టి ఈణ్ణె కాపిరం జేస్తుండడంట. ఇంగ రాత్రిళ్లు శేషయ్య ఆయిన పిల్లలూ,

పెండ్లాం నెత్తులల్ల వెట్టుకున్న మాణిక్యాలు లైట్లోలె చెక్ చెక్కున మెరుస్తవంట,

ప్రతి అమాసకు మర్రిచెట్టయ్య తన నిజరూపం జూపినట్ల వూడలూ కొమ్మలు వెంచుతడంట. ఇంగమొగులు అంటంగవెంచిన ఆవూడలు వట్టుకోని నారదయ్య అప్పుడప్పుడు బహావండలానికొచ్చి పాటవాడి, ఆదిశేషయ్యనూ, కృష్ణయ్యను సంబురపెట్టి ఆయింత శేషయ్య యిచ్చె వణిగొంచవోయి ఇంద్రుని పెండ్లాం, ఐరోని కుండతల్లి లేదు! ఆమెకు యిస్తడంట!

ఈమహిమంత మనసిద్దులు యిద్దరు దివ్వెద్రుష్టిన జూసి మనూరి కర్ణప్ప టేండ్లకు జెప్పిన్రు. వాళ్లుస్తానాలు జేసి సల్వపంచెలు గట్టుకోని సిన్నాపెద్దల్తోటి గర్రి మర్రయ్య కాడ్కి వొచ్చి వూదుపొగలేసి వొనబోజినాల్జేసి ఈతకల్లు సాకవోసి ఆతీర్తం తలా యింత వుచ్చుకున్నరు. అదేం ? మహిమో ? గని అలనాడు బలరామయ్యకు వారుణీ దేవుత ప్రత్యక్షమైనట్లె సెట్టును జూడొచ్చిన నెంబర్లందరికి ఆడున్న యీతయ్య అమ్రుతం బంచిండంట.

ఇట్ల మన పెద్దమర్రయ్యవూడలు వట్టుకోని యాళ్లాడుకుంట కిరాయిలు వెట్టు కోగలిగినోళ్లు పట్నానికి అంతకన్న చిక్కగున్నోళ్లు డిల్లికి రాకపోకలు సాగిచ్చుకుంట రేపటి గద్దెలకు సూటివెట్టిన్రు.

అదేం? కరామతోగని ఈసెట్టుజోలి వచ్చెట్యాళ్లకు నోట్లెనాల్కలేనోళ్లందరు లేసి కూసోని గలగలంట సెలేర్లు దుంకినట్ల దూపగొన్నోడు గడగడ మంచినీళ్లు తాగినట్ల మాట్లాడవట్టిన్రు. ఎందుకన్నామంచిదని యీపెబ్బలందరు యీలోకంల న ల్గురిమంచికి పని కొచ్చె మాటముచ్చెట్లె జేస్తరంట. ఇంగావో రొండాకులు ఎక్కువ జదివినోళ్లు,

ఈ ఆదిమహావటవురుక్షాన్ని ఎంతవొగిడినాలొచ్చె! యీ చెట్టు యీవిముంగల దానకర్ణుడు శిబిసెక్రవర్తి అంటె యాపాటి ? ఎంతటోళ్లు ? ఇల్లల్కనా ? దస్తురమాలం దియ్యన ? వాళ్లిద్దరుగుడ యింతో ? అంతో ? మిగిలచ్చుకున్నోళ్లె , ఎంతిచ్చిన గని మెళ్ల ముత్తాలదండలు కిరీటాలు యియ్య లేదుగద ? మరి మనపెద్దమర్రయ్య వాళ్లోలె గాకుండ కేవులం ప్రజలకోసమె బత్కుతుండడు. నిలువెల్ల దయపొంగినట్ల ప్యాదోళ్ల కష్టాలు జూసికన్నీళ్లొలికినట్ల పాలుకారుస్తడు పాపం ఈ సెట్లయ్యకు అందరు తన మనోళ్లె. అంటరానితనం లేదు. అడ్కతినెగుణంలేదు ముట్టకు ముట్టకు నా తమ్మి

ముద్దెసస్తవ్! నాతమ్మి! అంటదూరం జర్గడు! హరిజనులు! అడ్కనవడ్డోళ్లు, కుంటీ, గుడ్డి, ప్యాదాసాదా ! బడ్గాబాపన అందర్ని కడ్పుల వెట్టుకుంటడు.

తన, ఏరూ, ఆకూ, పిందేకాయె, వూడ, బెరుడు, బెండు, అన్ని మందికె యిస్తడు . ఇస్తార్లకంట ఆకుదెంపిన, మందు మాకు కంట పొలువిండుకున్న కేదార గౌరమ్మ నోముకు వూడలు వెర్కినా, నగుమొకం బెడ్తడు గని వోనాడన్న వొర్లన్నడ? వోసరిల్లిండ? పంతులకు జెప్పిండ? పట్వారిని విల్సిండ ? పంచాయతి వెట్టిండ ? యాది లేదు.

అందికె మనం యీసెట్టయ్యకు సన్మానం జెయ్యాలె లేకుంటె మనకన్న కాకులె నయం అయితయి. ఆసెట్టున గూసుండి ఆపండ్లు దిన్న గురుత్వానికి పొద్దున్నె మనకు దెల్వని బాసల సెట్టయ్యను పొగుడ్తుంటయి. అంట రాపిచ్చుకోని దొర్కిన మంత్రి ముంగల వొణుక్కుంట నిలవడి పండ్లిగిలిచ్చి కాళ్లు గుంజంగ పక్కలున్న పి.యె. సేతుల తెచ్చిన కాయితాలు గుక్కి, ధూం, ధాం, అనుకుంట వూరిమొకం బట్టిన్రు.

మనిషి ఎంటనె ఆశ అంట పుట్టుకొస్తది అది వున్నంత సేపు పాకులాట తప్పదు. దినాలు సెప్పి సెప్పిరావు. యిప్పుడు వూళ్లెనల్గురి మాట కాదని మిర్రుగుంటె కుదుర్తాది? కుదరదు, అందుకని మర్రయ్య సత్కారం వొప్పుకునుడె మంచిదంట అందురు కలెవలుక్కున్నరు.

అంతబాగెగని ఈ సెట్టయ్య నిల్సిన తావును గురిచ్చి ఎవ్వరు వట్టిచ్చుకున్నట్లె లేదు, ఈసెట్టయ్య తన సంతును కందపిల్కలోలె పారిచ్చుకుంట పాపం ! గౌరయ్యకున్న రొండెకురాలపొలంల అరెకురంతానెసిక్కవట్టుకోని కాపిరం జేయవట్టె ! మరి యీ సంగతి ఎవ్వరి మనసుల మెదిల్నట్లె లేదు.

వూరంతసెట్టయ్య ముచ్చెట్నె. పొగడ్తలు, భజండ్లు మిన్నుముడ్తుండయి. ఈ యాళ్ల సెట్టయ్యకు సన్మానం వూడలయ్యకు సత్కారం మర్రయ్యకు మంగళార్తి జడలయ్యకు జేజేలు కొమ్మలయ్యకు కోటిదండాలు అంట సిన్నా పెద్దఅంత వొకటే పాట.

అందరికంటె మిన్నంగ గౌరయ్య బిడ్డ చిల్కతల్లి సంబురం సెప్పేటట్లె లేదు. అది పాలపొంగోలె కడలినురుగోలె పొంగుతుండది. ఆసిన్నది కుశాలుగ వాళ్లయ్యను జూసి నాయినా ! మనసెట్టయ్యకు పేరొచ్చింది. మనపూలుపుట్కలవడ్డవి. మన పొలం పావున

మయింది. రేపు యీ వూరికి పేరు వోయిన పెద్దలు వొస్తరంట ! అయ్యో ! వాళ్లు మనో ల్నె సద్దగట్క, బువ్వ, రొట్టెగిన దింటరంట నా? లేకపోతె అచ్చం మెరుగు బంగారం బువ్వొండిచ్చుకతింటర? నాదోస్తు బాలమణిజెప్తుండది. వాళ్లుగుడ సన్నబియ్యపు అన్నం దిని చాయె దాగి బిస్కోటుదింటరని. నాయినా నాయిన సబకు నన్నుదోల్కపోవె ! నేనొస్త ! మళ్ల దినాం సెట్టుకాడ నాగులను పూజిచ్చి పలారం బెట్టేది నేనే గద ! అంటే గౌరయ్య మెప్పితంగ బిడ్డను అల్మకోని

'అవును కొడ్క ! నీవు గౌరమ్మవు. నిన్నిడ్సి జడలయ్య ఎవ్వరి మెప్పులు పూజలు వట్టిచ్చుకోడు! పూలపర్కిణి గట్టుకొ ! నెత్తికి సమురురాపిచ్చుకోనికైగ, జడఅల్లిచ్చుకొ ! అట్లెవోదం గని అంటుండంగనె గౌరయ్య పెండ్లాం అందుకోని !

అయ్యో ! బద్దురం! ఈపెద్దోళ్లను నమ్మి, బట్టగట్టిందెవరు ? నక్కతంతులు జేస్తరు. ఎప్పుడు ముంచుతరో ? యాడదేలుస్తరొ తెల్వదు అంట నోరు జారిన పాపానికి గౌరయ్య పెండ్లాన్ని గుఱ్ఱునజూసుకుంట అయిందానికీ కాందానికి ఆడిపెత్తునం బనికిరాదు. నోరుమూస్కపడివుండు.

నాగ్గావల్సింది మట్కేముండది ? నాకున్న రొండు బిగాలల్ల అరబిగెడు బూమిల మఱ్ఱయ్య ఇల్లు గట్టుక సంసారం జేస్తుండడు, యిప్పుడేమొ చెట్టు సుట్టు రా బూమిని తొల్తనేసర్కారు ఖరీదు జేస్తుండరంట.

మఱ్ఱయ్య వూడలు తనపొలంల యాడవాకిచ్చి గట్టివడజేస్తడో అంట ముందు సూపు తోటి కిందికి దిగకుండ కర్ణపు రంగయ్య నర్కేసినట్ల నేను నర్కుతనంటె నీవూ మీయత్త అడ్డం దగిలి అయ్యో ! పిల్లలు గల్లోళ్లం పచ్చన్ని సెట్టు పదిమందికి మంచి సెడ్డకు మందుకు మాకుకు ఎండకు ఎశ్మికి వానకు వొర్పుకు సలికీ యీాదరకు అక్కరకొచ్చి కన్నతల్లోలె కడుపుల వెట్టుక కాపాడే సెట్టును నర్కుతవా ? అంట సక్కన యాడ తట్టుకోకుండ సొర్గం బోదమని వొద్దంటె వొద్దంటిరి.

ఈసెట్టయ్యకు యీయాళ్ల వేలకు వేలు ఖర్చువెడ్తుండరు. అందుట్ల నా అర బిగెడు పొలం ఖరీదు గట్టిస్తె ! మఱ్ఱయ్య పేరు జెప్పుకోని నాలచ్చన్న నెత్తిన నాల్గక్షింతలేసి ఆడి విల్లరుణం దీర్సుకుంట నని లక్ష్మిని దగ్గెరికి దీస్కోని వుద్దిచ్చుకోని కండ్లొత్తుకున్నడు.

తెల్లారింది కల్లం గుట్టకాడ జనం జాతరోలె జేరింద్రు, రాత్రంత బాటకు నిద్ర లేదు. వచ్చెమోటర్లు పోయెమోటర్లు బండ్లు, బస్సులు సైకిళ్లు గుయ్ఁ గయ్ఁ టింగు, టంగు బాట పొంటి అడ్డంగరంగురంగుల జాండలు గానొస్తుండవి. మామిడాకు తోరు ణాలల్ల బంతీ పోకపూలు కల్పికుచ్చి్రను. పట్కుపూలు, తంగెడిపూలు గుడ్డెల్లుపూలు అన్ని గల్పి గుత్తులోలె చెండ్లోలెజేసి యాళ్లాడేసింద్రు. మఱ్రిసెట్టు కింద ఎటూ వో పావు కోసెడు కసులూడ్చిచ్చి అల్కుజల్లిచ్చి్రను.

మఱ్రిసూట్టూర పేరిన కాకిరెట్టలు గొర్రెపెంటికలు, పెండకళ్లా యావి లేకుండ సుబ్రంజేపిచ్చి్రను. వున్నబోదెలల్ల పెద్ద బోదె జూసి యిదే ఆది బుడం అంట తీర్పు జేసి దానికిస్తానంజేపిచ్చినట్ల నీళ్లవోసికడ్గి జాజులు వూసి బొట్టువెట్టి, ఎర్రంచు జంట దోతులుజుట్టి్రను. దండోలె చామంతి పూలదండేసి్రను. ఎండిపాన్నుకర్ర జేపిచ్చి పక్కల వెట్టి్రను .గంధం పస్పు అత్తరు, పన్నీర్లన్ని కిస్తీలల్ల తబుకులల్ల సవరిచ్చి పెట్టి్రను.

జడలయ్య యిన్నాళ్లకు అవ్వుతోత్సవం జర్పుకుంటుండడు. అట్లగాదు నూటొక్క షష్టిపూర్తి జర్పుకుంటుండడు. ఏంచిత్రం ?

ఇంతకు మన మఱ్రయ్యకు తానే తరం వాడంట దెల్వదు తన సుట్టు యింత బలుగం యింత కంటె ఏంగావాలె! తనను ఝిూయాళ్ల గనంగ విల్చి పెద్దజేసి పీట వెట్టి పెండ్లిజేస్తుండరు. అసోంటోళ్లు తనకు నిల్వ నీడిచ్చిన గొరన్నను మరుస్తారు? మరు వరు! యాదో జీవునాదారం గల్పిస్తె ఏడేడు తరాలకు దీవెనార్తిచ్చుకుంట గడ్పుతుండె! పాపం చెట్టైనా దయగల్ల పొట్ట పాకులాడింది. అంతకంటె ఏంజేస్తడు? దానికి తోడు పెండ్లికొడ్కు తీర్గ సోకు జేస్కొని నల్లుట్ల నేనంట తన జోలి యాడవెడ్తడు ? మెత్తటి ఎద ఎంత గొట్టుకున్న గని పల్లెత్తి మాట్లాడే దినం గాదంట వూకున్నడు పాపం.

ఇదంతా జూసి వొచ్చిన వుంది వుుక్కుమీద ఏలేస్కొని ''ఇదేంచిత్రం ! జడలయ్య ఇన్నాళ్లకు షష్టిపూర్తి జేసుకుంటుండడు. ఇంతకు మఱ్రయ్యకు ఎన్నేండ్లో ? ఎప్పుడు వుట్టిండో?

ఆఁ మన దేవుండ్ల ప్రమాణంఈ దేవుండ్లకు అంటగడ్తె ఎట్ల ? మనకు అందిన లెక్కలల్ల ఎన్ని ఏండ్లో ? ఏండ్లుగాదు, ఎన్నోయుగాలు గిర్రున బండి చక్రాలోలె దిర్గితె దేవుతలకు వొక్క రాత్రి అయితదంట, అట్లనె వొనదేవుతల లెక్క ఏరంట. అని సెట్టు

కింది సిద్దులు జెప్పంగ, పంతుళ్లు కండ్లకు సురచ్చినాలు వెట్టుకోని లెక్కలు గట్టి యాడ్కో వోకాడ్కి కుదిచ్చి యీ నాటికి అరువై ఏండ్లంట దేల్సి పెండ్లి జేస్తుండరు.

'ఈ సెట్టయ్యకేంతక్కువ ? తనసుట్టు యింత బలుగం, ఎవరి కన్న గుడయింత కన్న వైబోగం ఏంగావాలె ? గని పాపం ! గౌరయ్య ' అంట మంది మనుసులు మముకారం వొల్కినయి.

ఇంగ బాటమ్మ సంబురం చెప్పెటట్లలేదు. కట్లుదెంచుకోని సంబురాన పొంగిన బాటవమ్మకు జడలయ్య సింగారిచ్చిన ఎర్రశవర్లాకుచ్చులు దాకినయ్, పైజల్లనంగ ఏందంట బాటమ్మ కండ్లెత్తి సూసింది. అనుకోకుండ యిద్దరి కండ్లు గల్సినయి, ఒగర్ని వొగరుజూసుకున్నరు. ఇద్దరు నగిర్రు. సిగ్గువడ్డరు. సోకులు వోయిర్రు. ఇద్దరేకమైర్రు,

ఇంతట్లకె సీటీలైనవి, సీటీలెంటనె కాకిబట్ట లోళ్లు కట్టెలు వట్టుకోని యిక్కడక్కడ వుర్కులు వెట్టవట్టిర్రు. ముందర మోటారుసైకిలు జయ్యిం మంట వొచ్చింది, అటెంక అంత సోరగదుడ్డె గాళ్లోలె వుండరు పత్రికలోండ్లు గిటనా? ఏందో ? దోతి కొసలు సేతులవట్టుకోని సూస్తండరు సుతారంగ. ఇంగ సెట్టయ్యను అన్ని కోణాల నుంచి మనిషిని నిలవెట్టి కూసోవెట్టి, పక్కసూపు, వాల్సూపు, వొంకరసూపు, నగు మొకం, అంట సూసినట్లు, సెట్టయ్యను యాదిక్కు నుండి దింపితె ముద్దుగుంటడో ? అంట తీరుతీర్న ఫోట్లుదింపుతుండరు. లైట్లు మెర్సినప్పుడల్ల ఆడున్న ఎర్గనోళ్లంత, ఫోటు గిరాఫ్ల మేం దిగినం అంట కుశివడ్తుండరు.

ఇదియిట్ల నడుస్తుండంగనె బరాబర్లు ఎక్కువైనయ్. అసలు మోటర్లొస్తుండవి, తేరోలె సాగుతున్న మోటర్ల అసలు మనిషి వొచ్చిండు. రథాన్నిజూసి సామిదర్శినం కోస్రం ఎగవడ్తున్న భక్తులోలె మంది యిర్గవడి సూడవట్టిర్రు.

ఇంతసేపు సెట్టయ్య సర్పరాయిల కూడు నీల్లెడ వాసి ముగ్గిన గౌరయ్య ఆయిన బిడ్డ చిల్కతల్లి పొద్దువాయె, యింగనన్న యింటి మొకాన వోయి వుత్కిన దోతి గట్టు కొస్తనంట వోయి పుడిసెడు నీళ్లు మొకాన జల్లుకోని దస్తురూమాల బుజానేస్కోని వొచ్చే ట్యాళ్కకు మర్రికాడ మంది వుస్కవోస్తెవుస్కరాలకుండ మూగిర్రు. తిప్పలువడి జనాన్ని తోసుకుంట దొబ్బుకుంట ముందలికి నడ్సట్యాళ్లకు ఎదురూగ జరుగతున్న కరామత్ జూసి గౌరయ్య నిల్వురాయివడ్డడు, కాళ్లకింద బూమి యాడ్కో గొట్క

పొవట్టింది.

సబమొదలైంది, లాంచినాలు నడ్సినయ్, ఇంగ యాణ్ణో జెరంత మిగులు వాటువుండింది.

కర్ణపురంగయ్య అంటె ? యిన్నాండ్లు సెట్టయ్యను సీదరిచ్చుకోని వూడలు దిగకుండ నర్కిన మాహానుభావుడు, రొండంచుల గంగజమున దోతి గట్టి, కంట్లకు నల్లద్దాలు వెట్టుకోని మందినికలె జూసుకుంట బుజం మీది కెళ్లి జారుతున్న సిలక్ సెల్లను త్యాపకో సారిసవరిచ్చుకుంట పెద్ద మంత్రయ్య పక్కన అంటె ఎడ్మబాజుపొంటి నిలవడి, ఎన్కటికి సత్తెబామ, కృష్ణయ్యను పారిజాతపు సెట్టుకు గట్టి నారదయ్యకు దారవోసినట్ల పెద్దమంత్రయ్యకు దారాదత్తం జేసిసేతులసేయి గల్పిండు.

సప్పట్లు తొప్పట్లను తలదన్నంగ మొగులు ముట్టినయ్

ఫొటుదింపెటోండ్లు మిషన్లు టిక్కు, టిక్కుమనిపిచ్చిన్రు. గౌరయ్య తేర్కొని చూసెట్యాళ్లకు అంత సీనిమోలె జరిగిపోయింది, ఆఖరికి తన సేతుల జిక్కింది తన బిడ్డ సేయి మట్కు నిజమైంది. గడిసేపట్ల మబ్బులిచ్చుకున్నట్ల మూగిన జనవంత యిచ్చుకపోవట్టిన్రు. ఆతొక్కులాటలల్ల సీమ, దోమ, గడ్డిపోసకు గుడ కొరగాని గౌరన్న బిడ్డ కాళ్లదొక్కంగ నలిగి నజ్జి గిజ్జి గాకుండ బద్దురంగ దాటిచ్చుకోని కాళ్లీడ్సుకుంట వుసూరుమంట యిల్లు జేరెట్యాళ్లకు యా యాళ్లైందొ ? యాపొద్దైందొ ?

అక్కా ! ఇదీ మన పెద్దమంత్రి కత !